www.prajasakti.com
# ప్రజాశక్తి
శనివారం 10 ఫిబ్రవరి 2024
5
పశ్చిమ గోదావరి



11న భీమవరంలో..

## 'ఆస్టర్ రమేష్' హాస్పిటల్ ప్రారంభం

**ప్రజాశక్తి - విజయవాడ**

గుండె జబ్బుల విభాగంలో ప్రఖ్యాతి గాంచిన ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో "ఆస్టర్ రమేష్' (భీమవరం హాస్పిటల్స్ - సెంటర్ ఫర్ కార్డియాక్ సైన్సెస్)ను ప్రారంభించనున్నట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ హాస్పిటల్‌ను ఆదివారం ఉదయం 11 గంటలకు పాలకొల్లు మాజీ శాసన సభ్యులు డాక్టర్ సి.హెచ్.సత్యనారాయణ మూర్తి ప్రారంభిస్తారని తెలిపారు. ఇద్దరు కార్డియాలజిస్టులు, ముగ్గురు క్లినికల్ కార్డియాలజిస్టుల బృందం అందుబాటులో ఉంటుందని తెలిపారు. హార్ట్ ఎటాక్, యాంజియోగ్రామ్, ఎమర్జెన్సీ వైద్య సేవలు అన్నివేళలా అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫేస్‌మేకర్, హార్ట్ ఫెయిల్యూర్ పేషెంట్లకు ఆ ప్రాంత ప్రజలకు అత్యుత్తమ వైద్య చికిత్సలు ఇప్పుడు నిత్యం 24 గంటలూ అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

# ఇంటి 'స్థలం' ఇరకాటం..!



- వేగంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- మృతి చెందిన లబ్ధిదారుల స్థలాలపై ఎటూ తేల్చని పరిస్థితి
- వారసులకు ఇచ్చేందుకు ఆప్షన్ లేదంటున్న అధికారులు
- ఉపాధికై ఇతర దేశాలకు వెళ్లిన మహిళల కుటుంబాల పరిస్థితీ అంతే
- రెండు జిల్లాలో పది వేల మందికిపైగా 'స్థల' బాధితులు
- ప్రభుత్వ నిర్ణయం తీసుకోవాలంటున్న లబ్ధిదారుల వారసులు

**జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడంతో లబ్ధిదారుల కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. దీంతో వేలాది ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కాకుండా ఆగిపోయిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిర్లక్ష్యంపై లబ్ధిదారుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

రెండు జిల్లాల్లో దాదాపు రెండు లక్షల ఇళ్ల స్థలాలను పేదలకు పంపిణీ చేసినట్లు ప్రభుత్వం లెక్కలు చెబుతోంది. పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర స్థలం చొప్పున కేటాయించింది. గతంలో ఇళ్ల స్థలాలకు సంబంధించిన పట్టాలు ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చింది. ఇప్పుడు ఎన్నికల ముందు జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. రెవెన్యూ యంత్రాంగమంతా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై దృష్టి సారించింది. ఈ ప్రక్రియలో అనేక సమస్యలు అధికారులను వెంటాడుతున్నాయి. లబ్ధిదారుల నుంచి వస్తున్న ప్రశ్నలకు అధికారులు సమాధానాలు చెప్పలేని పరిస్థితి ఉంది. ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వస్తున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడమే దీనికి కారణం. ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి పట్టాలు అందించిన తర్వాత అనేక మంది లబ్ధిదారులైన మహిళలు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. అంతేకాకుండా జీవనోపాధి కోసం అనేకమంది మహిళలు గల్ఫ్ దేశాలకు వెళ్లారు. ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల పట్టాలు మృతి చెందిన, గల్ఫ్ దేశాలకు వెళ్లిన మహిళల పేరుపైనే ఉన్నాయి. ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయాలంటే లబ్ధిదారులు కచ్చితంగా ఉండాలనే నిబంధన విధించారు. దీంతో మృతి చెందిన, దేశం విడిచి వెళ్లిన లబ్ధిదారులకు చెందిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ఆగిపోయింది. లబ్ధిదారుల వారసులు వెళ్లి తమ పేరును రిజిస్ట్రేషన్ చేయాలని, అవసరమైన పత్రాలు అందిస్తామని చెప్పిన అధికారులు కుదరదని చెబుతున్నారు. మృతి చెందిన, అందుబాటులో లేని లబ్ధిదారుల స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎటువంటి ఆప్షన్ ఇవ్వలేదని అధికారులు సమాధానమిస్తున్నారు. ప్రతి సచివాలయ పరిధిలో తక్కువగా లెక్కించినా ఇటువంటి సమస్యలు ఉన్న ఇళ్ల స్థలాలు పదికిపైగా ఉన్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. రెండు జిల్లాల్లో వెయ్యికిపైగా గ్రామ సచివాలయాలు ఉన్నాయి. ఈ ప్రకారం లెక్కిస్తే దాదాపు పది వేలకుపైగా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ కాకుండా నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. మృతి చెందిన లబ్ధిదారుల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ప్రభుత్వం ఎటువంటి ఆదేశాలూ జారీ చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ తోటి లబ్ధిదారులంతా ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్నా తమ కుటుంబానికి వచ్చిన స్థలం రిజిస్ట్రేషన్ కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వానికి ఇది ఎదురుదెబ్బగా తీవ్ర చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మృతి చెందిన, అందుబాటులో లేని లబ్ధిదారుల ఇంటి స్థలాల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఒక నిర్ణయం తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

## ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేసుకోవాలి

### కలెక్టర్ ప్రశాంతి



విద్యార్థులకు నులిపురుగు నివారణా మాత్రలు వేస్తున్న కలెక్టర్

**ప్రజాశక్తి - భీమవరం**

నులి పురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు తప్పక వేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ పొట్టి శ్రీరాములు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు కలెక్టర్ స్వయంగా ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో అనారోగ్యానికి కారణమయ్యే నులి పురుగుల నివారణలో భాగంగా ఒకటి నుండి 19 ఏళ్ల లోపు వయస్సు ఉన్న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ తప్పక వేసుకోవాలని అన్నారు. నులి పురుగులు ఉన్న పిల్లల్లో రక్తహీనత, పోషకాల లోపం, ఆకలి మందగించడం, బలహీనత, కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు, బరువు తగ్గడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, తహశీల్దారు ఎల్.శివకుమార్, ఎంఇఒలు, ప్రధానోపాధ్యాయులు, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## దగా డిఎస్‌సి కాదు.. మెగా డిఎస్‌సి ప్రకటించాలి

### డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ఉపాధ్యాయ అభ్యర్థుల నిరసన



అంబేద్కర్ సెంటర్లో నిరసన తెలియజేస్తున్న నేతలు

**ప్రజాశక్తి - భీమవరం**

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వైసిపి ప్రభుత్వం ఉపాధ్యాయ అభ్యర్థులను నిలువునా మోసగించిందని, అతి తక్కువ పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ దారుణమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ విమర్శించారు. దగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను వెనక్కి తీసుకుని మెగా డిఎస్‌సి 25 వేల పోస్టులతో ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రకాశం చౌక్‌లో డివైఎఫ్ఐ జిల్లా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ అభ్యర్థులతో శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. తొలుత స్థానిక అంబేద్కర్ సెంటర్ వద్ద నిరసన తెలిపి అక్కడి నుంచి ప్రకాశం చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ జిఒ 117 ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు కుదించి నిరుద్యోగులను మోసగించడం దారుణమన్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్ఎన్‌వి.శర్మ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించకుండా తమ ఎన్నికల ప్రయోజనం కోసం దగా డిఎస్‌సిని ప్రకటించడం సిగ్గుచేటని మండిపడ్డారు. అప్రెంటీస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘీభావం తెలిపిన కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం మెగా డిఎస్‌సి పేరిట నిరుద్యోగ యువతను దగా చేయడం దారుణమని విమర్శించారు. డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి.రాంబాబు మాట్లాడుతూ మెగా డిఎస్‌సి ప్రకటించకపోతే భవిష్యత్తులో పోరాటాలను మరింత ఉధృతంగా కొనసాగిస్తామని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయన్నారు. మెగా డిఎస్‌సి విడుదలతో న్యాయమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు శాంతి, సహాయ కార్యదర్శులు గణేష్, శ్రీను, పట్టణ కమిటీ సభ్యులు సుధీర్, మహిమ, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పిల్లి చంటిబాబు, డి.రవితేజ, శేషు, బాలాజీ, జిల్లా కమిటీ సభ్యులు పి.దుర్గారావు, కె.ప్రమోద్, ఆనంద్, జోసెఫ్, జయరాజు పాల్గొన్నారు.



మొగల్తూరులో..



పెనుగొండలో..



పోడూరులో..

# సమస్యలు పరిష్కరించకుంటే గుణపాఠం తప్పదు

### కొనసాగిన ఆశాల ఆందోళనలు



భీమవరంలో..

**ప్రజాశక్తి - కాళ్ల**

ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు రెడ్డి దేవి హెచ్చరించారు. కాళ్ల పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో పైడితల్లి, రజిని, చిట్టి మరియ, ఇప్పుల లక్ష్మి, సిఐటియు మండల కార్యదర్శి మండా సూరిబాబు పాల్గొన్నారు.

**పెంటపాడు :** ఆశాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ స్థానిక పిహెచ్‌సి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, సిపిఎం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు నాయకులు బంకురు నాగేశ్వరరావు, ఆశా నాయకురాలు వై.జయంతి మాట్లాడారు. ఆశాలకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం జిఒ అమలు చేయాలన్నారు. అరెస్ట్ చేసిన ఆశాలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగమణి, అచ్యుతాంబ, వరలక్ష్మి, మల్లేశ్వరి, ధనలక్ష్మి, ఆదిలక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

**ఆచంట :** ఆశాలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆచంట వేమవరం, వల్లూరు పిహెచ్‌సిల వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు నక్కా శైలజ, కార్యకర్తలు నెక్కంటి కనకదుర్గ, గంగాభవాని, మీనాకుమారి, డి.సత్యవతి, లక్ష్మీకుమారి, విజయలక్ష్మి, భవాని, సూర్యకుమారి, కృప, వీరవేణి పాల్గొన్నారు.

**అత్తిలి :** ఆశా వర్కర్లు స్థానిక పిహెచ్‌సి నుంచి బస్టాండ్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**వీరవాసరం :** ఆశా వర్కర్లపై ప్రభుత్వ నిర్బంధం సిగ్గుచేటని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం వీరవాసరం, కొణితివాడ పిహెచ్‌సిల వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**భీమవరం రూరల్:** ఆశాలు స్థానిక ఎస్‌పి స్ట్రీట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఆశాలు అనంతకుమారి, జ్యోతి, మేరీ, భవాని, లక్ష్మీదుర్గ, శ్రీదేవి పాల్గొన్నారు.

**ఆకివీడు:** ఆశాలు రాష్ట్ర ప్రభుత్వ నిర్బంధకాండను నిరసిస్తూ జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని బహిష్కరించారు. శుక్రవారం పెదకాపవరంలోని పిహెచ్‌సి, ఆకివీడు అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తోట పద్మ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు మండల కార్యదర్శి తవిటి నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు మండలాధ్యక్షులు పెంకి అప్పారావు, నేతలు వై.రామలక్ష్మి, నాగమణి, యశోద, అశ్విని, సుధా వెంకమ్మ, మార్తమ్మ, ఫాతిమా, నాగలక్ష్మి పాల్గొన్నారు.

**గణపవరం :** మండలంలోని గణపవరం, పిప్పర పిహెచ్‌సిల వద్ద ఆశాలు ఆందోళన నిర్వహించారు. సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నేతలు ఆర్.వెంకటలక్ష్మి, స్రవంతి, టి.వరలక్ష్మి, సిహెచ్.కృష్ణకుమారి పాల్గొన్నారు.

**పోడూరు:** ఆశా వర్కర్లు పోడూరు పిహెచ్‌సి వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు నేత పి.ప్రసాద్ మాట్లాడారు.

**మొగల్తూరు:** ఆశాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యాన ఆశాలు గాంధీబొమ్మ సెంటర్ నుంచి పిహెచ్‌సి వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో ఆశాలు పి.ప్రసన్న, పి.బేబీకుమారి, కె.నాగరాణి, పి.రేవతి, కె.నాగలక్ష్మి, ఆర్.మరనాత పాల్గొన్నారు.

**నరసాపురం:** చలో విజయవాడ నేపథ్యంలో అక్రమ అరెస్టులు, నిర్బంధాన్ని నిరసిస్తూ ఆశాలు శుక్రవారం ఎల్‌బిచర్ల పిహెచ్‌సి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎల్‌బి.చర్ల సెంటర్ నుండి పిహెచ్‌సి వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో పి.రత్నకుమారి, బి.జయలక్ష్మి, పి.మార్తమ్మ, ఎన్.చిన్నారి, బి.పద్మ, ఎం.విజయకుమారి, సిహెచ్.నాగలక్ష్మి పాల్గొన్నారు.

**పెనుగొండ:** ఆశలకు కనీస వేతనం చెల్లించాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని కోరుతూ, చలో విజయవాడ నేపథ్యంలో ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ సిద్ధాంతం పిహెచ్‌సి వద్ద ఆశాలు నిరసన తెలిపారు. తొలుత బస్టాండ్ సెంటర్ నుంచి పిహెచ్‌సి వరకూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్ల నేత కంకిపాటి లక్ష్మీకుమారి, సిఐటియు నాయకుడు కప్పల రత్నరాజు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకుడు కడలి త్రినాథ్, ఆశా కార్యకర్తలు కె.ఎలిజిబెత్‌రాణి, డి.రాజేశ్వరి, జి.వీరకుమారి, జి.గంగ, ఎం.రేణుక, కె.శ్యామల, కె.మణికుమారి పాల్గొన్నారు.

## సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ పి.ప్రశాంతి

**ప్రజాశక్తి - భీమవరం**

రానున్న సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో రీసర్వే, సమిత్వ, గృహాల రిజిస్ట్రేషన్, వైద్యఆరోగ్యశాఖ, ఎన్నికలు తదితర అంశాలపై అధికారులతో జాయింట్ కలెక్టర్ ఎస్. రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్లు, ఎంపిడిఒలు బాధ్యతాయుతంగా వ్యవహరించి సమర్థవంతంగా విధులు నిర్వహించాలన్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతంగా సాగుతుందని, దీనిలో పొరపాట్లు దొర్లకుండా సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వివరాలు, రూట్‌మ్యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. రానున్న వేసవి దృష్ట్యా జిల్లాలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందుగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో ఆర్‌డిఒలు కె.శ్రీనివాసులురాజు, యం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్‌మాధుర్, జిల్లా, వార్డు, గ్రామ సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, జిల్లా అధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

**మల్టీపర్పస్ గొడౌన్లను వినియోగంలోకి తేవాలి**


మల్టీపర్పస్ గొడౌన్లను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంతి జిల్లాస్థాయి అమలు కమిటీ సభ్యులతో మల్టీపర్పస్ గొడౌన్ల నిర్మాణాలపై సమీక్షించారు. జిల్లాలో 22 గొడౌన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉండగా ఇప్పటికి ఎనిమిది గోడౌన్లు నిర్మించారన్నారు. మిగిలిన నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి జిల్లా కోఆపరేటివ్ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిసిసిబి ఎజిఎం నరసింహారావు, మార్కెటింగ్ ఎడి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి సిహెచ్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా అదనపు న్యాయమూర్తి సత్యదేవి

**ప్రజాశక్తి - భీమవరం**

భీమవరంలో అన్ని కోర్టుల ప్రాంగణాల్లో మార్చి 9న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని భీమవరం మూడో అదనపు జిల్లా న్యాయమూర్తి సత్యదేవి సూచించారు. స్థానిక కోర్టు హాల్లో న్యాయవాదులతో శుక్రవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. కొన్ని అపరిష్కృతంగా ఉన్న కుటుంబ ఆస్తి తగాదాలు, వివాహ సంబంధమైన కేసులు, మోటారు వాహన ప్రమాద భీమా కేసులు, సివిల్ తగాదాలు గుర్తించినట్లయితే, ఆ కేసుల్లోని ఉభయ పార్టీలకు గూగుల్ మీట్ ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి సమ న్యాయం అందించడానికి ఉమ్మడి జిల్లా శాశ్వత లోక్ అదాలత్ ఛైర్మన్‌ను ఉన్నత న్యాయస్థానం నియమించిందన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులకు తెలియజేయాలని న్యాయవాదులను కోరారు. ఈ సమావేశంలో న్యాయమూర్తులు బి.అప్పల స్వామి, జి.సురేష్‌బాబు, డి.ధనరాజు, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎం.వెంకట రమణారావు, జనరల్ సెక్రటరీ పి.రమేష్ బాబు, ట్రెజరర్ బి.అశోక్‌బాబు, ప్యానల్ లాయర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్యులు డాక్టర్ అడ్డా రవీంద్రనాద్

## ఎలక్ట్రికల్ రంగంలో నూతన ఆవిష్కరణలు అవసరం

**ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం**

ఎలక్ట్రికల్ రంగంలో నూతన ఆవిష్కరణల అవసరం ఎంతో ఉందని, విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలని గౌహతి ఐఐటి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ అడ్డా రవీంద్రనాథ్ సూచించారు. ఎపి నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో కాంప్రహెన్సీ ఓవర్ వ్యూ ఆఫ్ యాక్టివ్ పవర్ డికాప్లింగ్ విత్ అప్లికేషన్ స్విచ్డ్ బూస్ట్ ఇన్వెర్టర్ అనే అంశంపై శుక్రవారం సాయంత్రం విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు వేసే ప్రతి అడుగు వారి విజయానికి మెట్టుగా నిలవాలని చెప్పారు. ఆధునిక పోటీ ప్రపంచంలో రాణించాలంటే కొత్త సాంకేతికతలపై పట్టు సాధించాలని సూచించారు. ఎలక్ట్రికల్ రంగానికి సంబంధించి దేశంలో జరుగుతున్న పలు పరిశోధనల గురించి వివరించారు. ఇన్వర్టర్ నుంచి వచ్చే విద్యుత్ నాణ్యతను పెంచుకునేందుకు ఎటువంటి పరికరాలను సమకూర్చుకోవాలి, కెపాసిటర్, ఇండక్టర్ పరికరాల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇఇఇ విభాగాధిపతి డాక్టర్ టి.రమేష్, ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, డాక్టర్ శ్రీ ఫణీకృష్ణ కర్రి, డాక్టర్ వి.సందీప్, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

## పొన్నపల్లిలో ఏటిగట్టు పరిశీలన

**ప్రజాశక్తి - నరసాపురం**

పట్టణంలో పొన్నపల్లి వద్ద గోదావరి గట్టు పనుల్లో నాణ్యతా లోపం కారణంగా మూడోసారి జారిన ఏటిగట్టును మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటిగట్టు పనులకు వినియోగించే రాయి నాణ్యతపై అనుమానాలు వెల్లువెత్తుతున్నా, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాల్లేవన్నారు. ఈ పనులకు బినామీ కాంట్రాక్టర్ ఎంఎల్‌ఎ ప్రసాదరాజు కావడంతో అధికారులు స్పందించడం లేదని ఆరోపించారు. ఈ పనులపై సిబిఐ విచారణకు ఆదేశించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు. వర్షాలు, వరదలు లేని సమయంలో ఇప్పుడే గట్టు కుంగిపోతుంటే తుపాన్లు, వరదల సమయంలో గట్టు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. నాణ్యతా లోపంతో చేస్తున్న ఏటిగట్టు పనులకు బిల్లుల మంజూరు ఎలా చేస్తారని నిలదీశారు. ఆయన వెంట టిడిపి నేతలు చిటికెల రామ్మోహన్‌రావు, పొన్నమండ నాగేశ్వరరావు, ఆండ్రాజు రామన్న, చెంపాటి సత్యనారాయణరాజు, రేవు ప్రభుదాస్, కొండేటి శ్రీను, వాతాడి కృష్ణ, మాండ్రు హేమలత, నడిపుడి కృష్ణ, నిప్పులేటి బోసు, రెడ్డి శ్రీను, పులపర్తి శ్రీధర్, యర్రమిల్లి యోగి, కొల్లటి హరి, కవురు రంగ, గన్నవరపు శ్రీను పాల్గొన్నారు.



ఏటిగట్టును పరిశీలిస్తున్న మాజీ ఎంఎల్‌ఎ మాధవనాయుడు

## హెల్మెట్‌ధారణ తప్పనిసరి

### జిల్లా రవాణా శాఖాధికారి ఉమామహేశ్వరరావు

**భీమవరం:** ద్విచక్ర వాహనాలు నడిపే ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా రవాణా శాఖాధికారి టి.ఉమామహేశ్వరరావు సూచించారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణా శాఖ ఆధ్వర్యంలో విస్సాకోడేరు రిలయన్స్ పెట్రోల్ బంక్ నుండి ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ప్రారంభించిన ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాద సమయంలో ప్రాణాపాయ స్థితి నుండి బయటపడవచ్చన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. వాహనాలను మితిమీరిన వేగంతో నడపడం, మద్యం సేవించి నడపడం ప్రమాదాలకు కారణమవుతుందని హెచ్చరించారు. ర్యాలీలో భీమవరం ట్రాఫిక్ సిఐ దాసు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సిహెచ్.వెంకటరమణ, కెఎస్ఎన్.ప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎం.రవికుమార్, ఎన్ఎల్ఎస్.లక్ష్మి, సిబ్బంది, భీమవరంలోని వివిధ బైక్ షోరూమ్‌ల సిబ్బంది, 120 మంది వాహనదారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో క్యాంటీన్ ప్రారంభం

**భీమవరం :**జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఆధునికీకరించిన విజయ దుర్గ క్యాంటీన్‌ను ఇన్‌ఛార్జి జిల్లా రెవెన్యూ అధికారి బి.శివన్నారాయణరెడ్డి, ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టరేటు అధికారులకు, సిబ్బందికి, కలెక్టరేటుకు వచ్చే ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో అందించాలన్నారు. చిరుధాన్యాలతో చేసిన వంటకాలకు తొలి ప్రాధాన్యతను ఇవ్వాలని, వ్యాపారానికి నమ్మకమే పెట్టుబడి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, సిబ్బంది పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్ ఫలితాలు విడుదల

**పోడూరు:**ఈ నెల నాలుగో తేదీన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 5, 10వ తరగతులకు నిర్వహించిన యుటిఎఫ్ ప్రతిభా పాటవ పరీక్షా ఫలితాలను శుక్రవారం యుటిఎఫ్ మండలం శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దాసరి క్షేమమూర్తి, కేతా నాగరాజు విడుదల చేశారు. ఈ పరీక్షల్లో పదో తరగతి ఇంగ్లీష్ మీడియంలో మొదటిస్థానం కొమ్ముచిక్కాల హైస్కూల్ విద్యార్థిని ఐ.మోక్షిత, రెండో స్థానం గుమ్మలూరు హైస్కూల్ విద్యార్థిని జి.కృష్ణలహరి, పదో తరగతి తెలుగు మీడియంలో మొదటి స్థానం కవిటం హైస్కూల్ విద్యార్థిని ఖండవల్లి జాస్మిన్, రెండో స్థానం వేడంగి హైస్కూల్ విద్యార్థి సరెళ్ల నవ్యశ్రీ, అలాగే ఐదో తరగతిలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎన్ఆర్‌పేట జిన్నూరుకు చెందిన గేదెల ప్రియ, పిల్లి హర్షితసాయి, కె.పూర్ణచంద్ర ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నిలిచారు. విజేతలకు ఈనెల 15న బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

## దగాకోరు ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

### ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

రాబోయే ఎన్నికల్లో దగాకోరు బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లంక కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడారు. 16న దేశ వ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌కు అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా, ప్రత్యేక నిధులు వంటివి మరిచిందన్నారు. అన్ని విధాలా రాష్ట్రానికి అన్యాయం చేసిందన్నారు. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు దండు శివరామరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులు పెద్దలను గౌరవించాలి

**నరసాపురం:**విద్యార్థులు తమ కుటుంబ విలువలు కాపాడుకోవడం ద్వారా లక్ష్య సాధనకు మరింత చేరువ అవుతుందని నరసాపురం చైతన్య స్కూల్ ప్రిన్సిపల్ బిజెవి.వేణుగోపాల రావు అన్నారు. బుధవారం పాఠశాలలో ఫ్యామిలీ ఫెస్ట్ 2024 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ కుటుంబ విలువల ప్రాముఖ్యతను కాపాడుకోవడంలో నమ్మకం, బాధ్యత, బంధం, అవగాహన, నిజాయతీ, ప్రేమ తదితర అంశాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. అనంతరం విద్యార్థులు తమ తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ క్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంలో పలువురు ఆకట్టుకున్నారు.

## ఆశాలపై దాడికి ఖండన

**నరసాపురం:**ఉద్యోగ భద్రత, జీతాల పెంపు డిమాండ్‌తో రాష్ట్ర నలుమూలల నుంచి చలో విజయవాడకు బయలుదేరిన ఆశా కార్యకర్తలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడాన్ని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు శిరిగినీడి రాజ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆశాలను అదుపులోకి తీసుకునే సమయంలో మహిళా పోలీసులే కాకుండా మగ పోలీసులు కూడా వారి మీద దాడికి పాల్పడి దుశ్శాసన పర్వానికి తెరతీశారంటే ఈ సమాజం ఎటు పోతోందని పేర్కొన్నారు. శాంతియుతంగా ర్యాలీకి పూనుకుంటే వారిపై లాఠీఛార్జి చేయడం ఎంతో వరకూ సమంజసమని పేర్కొన్నారు. ఆశాలకు న్యాయం చేయకపోతే భవిష్యత్తు లో జగన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని రాజ్యలక్ష్మి హెచ్చరించారు.

## వేగం కన్నా ప్రాణం మిన్న

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ఆర్‌టిసి ఉద్యోగులచే పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని భీమవరం డిపో మేనేజర్ పిఎన్‌వి‌ఎం.సత్యనారాయణ మూర్తి, ప్రముఖ సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి ప్రారంభించారు. ఈ ర్యాలీ భీమవరం బస్ స్టేషన్ నుండి ప్రకాశం చౌక్ మీదుగా తిరిగి బస్ స్టేషన్ చేరుకుంది. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి ఎ.వీరయ్య చౌదరి, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఎం.ఎస్వి శివరామ బద్రి రాజు, ప్రముఖ సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. కార్యక్రమంలో భీమవరం డిపో మేనేజర్ పిఎన్‌వి‌ఎం.సత్యనారాయణమూర్తి, పర్సనల్ ఆఫీసర్ ఎల్.గీతావాణి, ట్రాఫిక్ ఇన్‌ఛార్జి వై.సురేష్, ఆర్.బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. మొత్తం 60 మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారిలో మహిళా కండక్టర్ సైతం ఉండడాన్ని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. వీరయ్య చౌదరి ప్రత్యేకంగా అభినందించారు.

## క్షతగాత్రులకు జనసేన సాయం

**తాడేపల్లిగూడెం:**ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంటపాడు మండలం విప్పర్రు గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బలిజ రాము, ఇద్దరు పిల్లలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి విప్పర్రు గ్రామ జనసేన ఆధ్వర్యంలో శ్రీనివాస్ చేతుల మీదుగా 40 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో విప్పర్రు, తాడేపల్లిగూడెం జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు న్యాయం చేయాలి

**ఉండి:**ఎన్ఆర్‌పి అగ్రహారం గ్రామంలోని జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని తహశీల్దార్ కొమ్మన శ్రీనివాస్‌ను ఎన్ఆర్‌పి అగ్రహారం మాజీ సర్పంచి కొరు కోటేశ్వరరావు, వైసిపి నాయకులు దేవరకొండ వెంకటరామయ్య, వీర్రాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7 కిలోమీటర్ల అవతల నివాసయోగ్యం లేని స్థలాలుకాని ఇవ్వడంతో లబ్ధిదారులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, పంపించడం వెనుక ఆంతర్యం ఏంటో ఉన్నతాధికారులు బయటపెట్టాలన్నారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ తొందర్లోనే వీటిపై దర్యాప్తు చేయించి లబ్ధిదారులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

## పట్టాలిచ్చారు.. భూమి స్వాధీనం మరిచారు

### గొరగనమూడి జగనన్న స్థలాల లబ్ధిదారుల వినతి

ప్రజాశక్తి - పాలకోడేరు

జగనన్న లేఅవుట్‌లో పట్టాలిచ్చి నాలుగేళ్లు అయిందని, నేటికీ భూమిని స్వాధీనం చేయలేదని గొరగనమూడి జగనన్న లేఅవుట్ లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్సి, ఎస్టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ ఆధ్వర్యంలో జగనన్న కాలనీకి చెందిన 110 మంది లబ్ధిదారులు శుక్రవారం తహశీల్దార్ కె.నాగార్జునకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

## నేరాలు.. ఘోరాలు..

## ఉరివేసుకుని బాలిక ఆత్మహత్య

**పాలకొల్లు :**పాలకొల్లు లక్ష్మీనగర్‌కు చెందిన 14 సంవత్సరాల బాలిక శుక్రవారం తెల్లవారుజామున ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బాలిక ప్రయివేటు స్కూల్లో 8వ తరగతి చదువుతోంది. బాలిక తల్లి ఆశా వర్కర్‌గా పని చేస్తోంది. రోజూలాగే గురువారం స్కూలుకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగొచ్చింది. అయితే తెల్లవారుజామున ఉరి వేసుకుని మృతి చెంది ఉండడాన్ని కుటుంబ సభ్యులు గుర్తించారు. దీంతో బాలిక తండ్రి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే బాలిక చదువుతున్న స్కూల్లో కొందరు విద్యార్థులు ర్యాగింగ్ చేశారని, మరుగుదొడ్ల వద్ద భోజనం చేయాలని బలవంతం చేశారని, దీంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుందని కొందరు చెబుతున్నారు. నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి ఆసుపత్రికి వచ్చి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ బాలిక ఎందుకు చనిపోయిందనే కారణాలు ఇంకా తెలియ రాలేదన్నారు.



## పొలమూరు డ్రెయిన్‌ను ఆధునికీకరించాలని ధర్నా

ప్రజాశక్తి - ఆచంట

పొలమూరు డ్రెయిన్‌ను తక్షణం ఆధునికీకరించాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెనుమంట్ర మండలం పొలమూరులో డ్రెయిన్ వద్ద కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గోపాలన్ మాట్లాడారు. ప్రతి సంవత్సరం సార్వాలో ఆకుమడి దశలో, పంట చేతికొచ్చే తరుణంలో అధిక వర్షాల కారణంగా డ్రెయిన్ పూడుకుపోవడంతో మురుగు నీరులాగే పరిస్థితి లేక పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. తక్షణం సంబంధిత అధికారులు డ్రెయిన్‌ను ఆధునికీకరించాలని ఆ ప్రాంత రైతులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు తోరం నరసన్న, గుడాల మాణిక్యాలరావు, పంతాల సూర్యనారాయణ, అప్పారావు, గుడాల వెంకటేశ్వరరావు, చంద్ర పుత్రిమూర్తులు, పెనుమంట్ర సుబ్రహ్మణ్యం, కేతా లక్ష్మి నరసన్న పాల్గొన్నారు.




పొలమూరులో డ్రెయిన్‌ను ఆధునికీకరించాలని ధర్నా చేస్తున్న రైతులు

## టిడిపి, జనసేనతోనే అభివృద్ధి

### ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, టిడిపి, జనసేన కలయికతోనే అభివృద్ధి సాధ్యమని ఎంఎల్‌ఎ మంతెన రామరాజు అన్నారు. కాళ్లలో ఇంటింటికీ టిడిపి, భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తొలుత ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకోవడంతోపాటు పెరిగిన విద్యుత్ ఛార్జీలు, గ్యాస్ ధరలు, ఇంటి, చెత్త పన్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మరోసారి గెలిపించాలని కోరారు. వైసిపి పాలనలో పంచాయతీ వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు జివి.నాగేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు కొప్పినీడి గణపతి, ఉప సర్పంచి పన్నాసి అబ్బులు, టిడిపి నాయకులు కడలి దుర్గాప్రదీప్, పుప్పాల బుజ్జి, మొగళ్ల షావుకారు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ మంతెన రామరాజు

## ఎస్‌ఆర్‌కెఆర్‌లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల వ్యవస్థాపకులు సాగి రామకృష్ణంరాజు 43వ వర్ధంతిని పురస్కరించుకొని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, మ్యాక్స్ విజన్ కంటి ఆసుపత్రి డాక్టర్ల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ఒకేరోజు 140 యూనిట్ల రక్తదానం చేయడం అరుదైన విషయమన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని మ్యాక్స్ విజన్ కంటి వైద్య చికిత్స నిపుణులు కళాశాలకు విచ్చేసి కళాశాల సిబ్బందికి ఉచితంగా వైద్య సేవలందించటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షులు ఎస్‌వి.రంగరాజు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆర్.కృష్ణచైతన్య, ఎఎస్ఎన్.రాజు, ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎఎస్ఎన్.రాజు, ధరణి ఛారిటబుల్ ట్రస్ట్, మ్యాక్స్ విజన్ హాస్పిటల్స్ మేనేజర్ రవితేజ పాల్గొన్నారు.

## ఆడపిల్లల ప్రాముఖ్యతను గుర్తించాలి

**గణపవరం:**సమాజానికి ఆడపిల్ల ఎంత అవసరమో ప్రతిఒక్కరూ గుర్తించాలని తాడేపల్లిగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ సిహెచ్ దుర్గా భవాని అన్నారు. శుక్రవారం పిప్పరలో జరిగిన బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచి కాకర బేబి అధ్యక్షత వహించారు. దుర్గాభవాని మాట్లాడారు. సమావేశంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ ఎస్.మేరీ గ్రేసెన్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాకర శ్యామ్, పిప్పర ప్రాథమిక ఆసుపత్రి కె.ప్రియాంక, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

## మోహనరావు కుటుంబానికి టిడిపి సాయం

**ఆకివీడు:**గత కొంతకాలంగా అనారోగ్యంతో ఉండి ఇటీవల మరణించిన ప్రజానాట్యమండలి డప్పు కళాకారుడు, రిక్షా కార్మికుడు కుంచాడ మోహనరావు కుటుంబానికి టిడిపి నాయకులు ఆర్థిక సహకారం అందజేశారు. మోహనరావు భార్య సరస్వతిని టిడిపి పట్టణ కార్యదర్శి గంధం ఉమా సత్యనారాయణ, 11వ వార్డు ఇన్‌ఛార్జి కొల్లి వెంకన్నబాబు తదితరులు శుక్రవారం పరామర్శించారు. అనంతరం ఐదువేల రూపాయల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, టి.విశ్వేశ్వరరావు, జి.సీతారాం పాల్గొన్నారు.

## ఆక్వారంగ అభివృద్ధికి జగన్ అవసరం

**నరసాపురం:**ఆక్వా రంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అవసరం ఎంతైనా ఉందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. కాలేజీ ఆఫ్ ఫిషరీస్ సైన్స్ ఆధ్వర్యంలో ఎపి ఫిషరీస్ యూనివర్సిటీ నేషనల్ డెవలప్‌మెంట్ సౌజన్యంతో స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో మత్స్య సంపద జాగృతి అభియాన్ వర్క్‌షాప్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి మంత్రి సిదిరి అప్పలరాజు ప్రారంభించి పరిశీలించారు. అనంతరం సభలో మంత్రి మాట్లాడారు. ఆక్వా రంగం నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుందన్నారు. రాష్ట్ర ఆక్వా ఫిష్ మర్చంట్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం మాట్లాడగా రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, మత్స్యశాఖ ఒఎస్‌డి డాక్టర్ సుధాకర్, డీన్ రవీంద్రకుమార్‌రెడ్డి, ఎం.మాధవన్, మున్సిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, ఆక్వా చేపల రైతుల సంఘాల అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అండ్రాజు చల్లారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

## ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదు : పితాని

ప్రజాశక్తి - ఆచంట (పెనుమంట్ర)

అధికార ధన దాహంతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి నెగ్గాలని చూస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. పెనుమంట్ర మండలం జుత్తిగ, వెలగలవారిపాలెంలో పితాని పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఓటాన్ బడ్జెట్ అంకెల గారడీ అని, నిధులు కేటాయించకుండా బుగ్గన మోసం చేశారని విమర్శించారు విద్యా దీవెనలో కోతల విధించడం అన్యాయమన్నారు. మనసారా ఆసరా కార్యక్రమానికి వచ్చి భోజనం చేసి వెళ్తుండగా రెండు చోట్ల ఆటో ప్రమాదాలు జరిగాయని, కరుగోరుమిల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారని వారిని కనీసం పరామర్శించలేని దుర్మార్గుడు శాసనసభ్యుడు శ్రీరంగనాథరాజు అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు రుద్రరాజు వెంకటరామరాజు, టిడిపి మండల అధ్యక్షులు టి.శ్రీనివాస్ రెడ్డి, జనసేన నేతలు పాల్గొన్నారు.

## జగనన్న సురక్షను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - ఉండి

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలిసిపూడి సర్పంచి కేసబోయిన జానకీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కలిసిపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జానకి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజల వైద్యం నిమిత్తం కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారన్నారు. నిరుపేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. అనంతరం జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ఆధ్వర్యంలో మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు, వైద్యులు బి.సాయి చంద్ర, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు అప్పల నరసమ్మ సంతాప సభ

### హాజరుకానున్న కమ్యూనిస్టు నేతలు, రాజకీయ ప్రముఖులు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు గ్రామానికి చెందిన కమ్యూనిస్టు నేత, గ్రామ మాజీ సర్పంచి కీర్తిశేషులు గాదిరాజు శ్రీరామరాజు భార్య అప్పల నరసమ్మ సంతాప సభ శనివారం జరగనుంది. ఆమె జనవరి 30న స్వగృహంలో తుది శ్వాస విడిచారు. అప్పల నరసమ్మ భర్త శ్రీరామరాజు సిపిఎం భీమవరం తాలూకా కార్యదర్శిగా, రైతుసంఘం భీమవరం డివిజన్ కార్యదర్శిగా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా పని చేశారు. 11 ఏళ్లపాటు గొల్లలకోడేరు గ్రామానికి సర్పంచిగా శ్రీరామరాజు గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. వీరి కుమారుడు గాదిరాజు సూర్యనారాయణరాజు కూడా గ్రామ సర్పంచిగా పని చేశారు. శనివారం జరిగే సంతాప సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సీనియర్ నేత జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, ఇతర ప్రజాసంఘాల నేతలు, వివిధ రాజకీయ పార్టీల ప్రముఖులు, గ్రామ పెద్దలు పాల్గొనున్నారు.



## శివ సేవా సంస్థ ద్వారా మరిన్ని సేవలు

### మాజీ ఎంఎల్‌ఎ వెంకట శివరామరాజు

ప్రజాశక్తి - ఉండి

శివ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు సంస్థను పున్నప్రారంభించామని మాజీ ఎంఎల్‌ఎ వేటుకూరి వెంకట శివ రామరాజు అన్నారు. శుక్రవారం శివ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పాలా శ్రీనివాస్‌కు వైద్య నిమిత్తం రూ.15 వేలను, విద్యార్థిని చింతపల్లి మల్లిక చదువు నిమిత్తం రూ.15 వేలు శివరామరాజు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. సంస్థ ద్వారా నియోజకవర్గంలోని ప్రజలకు ఆరోగ్యశ్రీ రాక ముందు ఉచితంగా సుమారు పది వేల మంది రోగులకు వైద్య సేవలందించినట్లు తెలిపారు. 20 వేల మంది రోగులకు అవసరమైన ఆపరేషన్లు చేయించామని తెలిపారు. ఎంఎల్‌ఎగా అపజయం ఎరుగని తాను 2019 ఎన్నికల్లో నర్సాపురం పార్లమెంట్ అభ్యర్థిగా ఉన్న రఘురామకృష్ణం రాజు అకస్మాత్తుగా పార్టీని వీడడంతో అధిష్టానం సూచనల మేరకు తాను పార్టీకి విధేయుడుగా ఉంటూ నరసాపురం పార్లమెంటులో పోటీ చేసి ఓటమిపాలయ్యానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి ఉండి స్థానాన్ని తనకు అప్పగిస్తానని చంద్రబాబు నాయుడు హామీ మేరకే తాను పార్లమెంట్ బరిలో నిలవడం జరిగిందని, అంతేతప్ప ఇష్టపూర్వకంగా నియోజకవర్గాన్ని వీడలేదని గ్రహించాలన్నారు. 2024 ఎన్నికల్లో ఉండి నియోజకవర్గ ఎంఎల్‌ఎ అభ్యర్థిగా అధిష్టానం తనకు అవకాశం కల్పిస్తుందనే ఆశతో ఉన్న శివరామరాజు విజయం సాధిస్తే నియోజకవర్గంలో ఎప్పటినుంచో నిలిచిపోయిన ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ ఛైర్మన్ సాగిరాజు సాంబశివరాజు, మాజీ ఎంపిటిసి మోపిదేవి శ్రీనివాస్, నరసాపురం పార్లమెంట్ తెలుగు విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి మాండ్రు సందీప్ పాల్గొన్నారు.

## వాసవికి ఐదు పరిశోధన కేంద్రాల మంజూరు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలోని 6 విభాగాలకు పరిశోధనా కేంద్రాలు మంజూరు చేసినట్లు కళాశాల పాలక వర్గ అధ్యక్ష కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడలో జెఎన్‌టియు కె.ఉపకులపతి ఆచార్య జివిఆర్.ప్రసాదరాజు చేతులమీదుగా పరిశోధన కేంద్రాల మంజూరు ఉత్తర్వులను అందుకున్నట్లు తెలిపారు. దీంతో ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగాలతో పాటు ఇంగ్లీష్ విభాగంలో కూడా పిహెచ్‌డి ప్రవేశాలకు వీలు కలుగుతుందని తెలిపారు. పరిశోధన కోసం ప్రథమ ప్రాధాన్యం ఇస్తూ దానికోసం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు, టెక్నికల్ డైరెక్టర్ చెక్కా అప్పారావు, డీన్స్ డాక్టర్ రాంబాబు, నరేష్, ఆయా విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

## ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాళ్ల

అధికారంలోకొచ్చిన వారంలో రోజుల్లో సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామని చెప్పి అమలు చేయకుండా వైసిపి ప్రభుత్వం మోసగించిందని యుటిఎఫ్ జిల్లా కోశాధికారిసిహెచ్.పట్టాభిరామయ్య విమర్శించారు. కోపల్లె హైస్కూల్‌లో యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యాన ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు జి.రామకృష్ణంరాజు, బిఆర్ఎంకె.స్వామి, ఎం.శంకర్రావు మాట్లాడారు.

## రైతులకు ఎలుకల మందు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

రైతులందరూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఇన్‌ఛార్జి మండల వ్యవసాయాధికారి బి.నాగరాజు అన్నారు. మండలంలో సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యాలయం వద్ద, రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. బ్రోమోడోయలీ ఎలుకల మందు కలిపిన విషపు ఎరను ఆచంట వేమవరం సర్పంచి జక్కంశెట్టి చంటి చేతుల మీదుగా ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 96 శాతం నూకలు, రెండు శాతం నూనె, 2 శాతం బ్రోమోడోలియన్ కలిపిన విషపు ఎరను రైతులు 10 గ్రాములు మించకుండా చిన్న చిన్న పొట్లాలుగా చేసి ఎలుకుల బొరియల వద్ద ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, రైతు సంఘం అధ్యక్షులు, రైతు భరోసా కేంద్రం ఇన్‌ఛార్జులు, పాల్గొన్నారు.

**ఆకివీడు :** రైతులు సామూహిక ఎలుకల నివారణకు చేపట్టే కార్యక్రమం ఏకముఖంగా చేపట్టాలని వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షులు నంద్యాల సీతారామయ్య అన్నారు. సహాయ సంచాలకులు శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ప్రియాంకతో కలిసి ఆయన రైతులకు మందు ఎలకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**పోడూరు :** సామూహిక ఎలుకల నిర్మూలనతో ఎలుకలను సమర్థవంతంగా నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ అన్నారు. పోడూరులో శుక్రవారం రైతులకు ఎర పొట్లాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులంతా ఈ పొట్లాలను తమ పంట పొలాల్లో ఎలకల బొరియల్లో పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి శెట్టిబత్తుల సువర్ణ రాజు, సొసైటీ ఛైర్మన్ రుద్రరాజు శివాజీ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**పాలకొల్లు రూరల్:** లంకలకోడేరు పిహెచ్‌సి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో లంకలకోడేరు హైస్కూల్ వద్ద జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో ఎంఇఒ ఆర్ఎస్‌విఎస్ జి.శర్మ ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చింతపర్రు హైస్కూల్ వద్ద గ్రామ సర్పంచి గుమ్మాపు పెద్దరాజు మాత్రలు పంపిణీ ప్రారంభించారు. డాక్టర్ నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.